ఎన్ఎస్‌పీసీఎల్‌కు సింగరేణి బొగ్గు

హైదరాబాద్ మే 15 (నమస్తే తెలంగాణ): సింగరేణి నుంచి ఎన్ఎస్‌పీసీఎల్(ఎన్‌టీపీసీ సెయిల్ పవర్ కంపెనీ)కి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం సింగరేణి కాలరీస్, ఎన్ఎస్‌పీసీఎల్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. సింగరేణి సీఎండీ బలరాం ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్‌మెంట్ ఎస్‌డీఎం సుభానీ సమక్షంలో సింగరేణి జీఎం(మార్కెటింగ్) ఎన్వీ రాజశేఖర్‌రావు, ఎన్ఎస్‌పీసీఎల్ సీఈవో దివాకర్ కౌశల్, జీఎంలు నీల్ కమల్, పలాష్‌లు అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారు. సింగరేణి నాణ్యమైన బొగ్గు సరాఫరా చేస్తుందనే నమ్మకంతోనే ఈ ఒప్పందం చేసుకున్నామని ఎన్ఎస్‌పీసీఎల్ అధికారులు వెల్లడించారు.

5 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు

న్యూఢిల్లీ, మే 15: గత నెలలో దేశ ఎగుమతులు, దిగుమతుల మధ్య అంతరం 5 నెలల గరిష్ఠాన్ని తాకింది. గురువారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం ఏప్రిల్‌లో ఎగుమతులు 9.03 శాతం పెరిగి 38.49 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇక దిగుమతులు 19.12 శాతం ఎగిసి 64.91 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్య లోటు 5 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 26.42 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ముడి చమురు దిగుమతులు 25.6 శాతం ఎగబాకి 20.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. బంగారం దిగుమతులు 3.09 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

డౌన్ ట్రెండ్‌లో గోల్డ్

క్రమేణా తగ్గుముఖం పడుతున్న బంగారం ధరలు

- రెండు రోజుల్లో రూ.2,450 పతనం
- హైదరాబాద్‌లో స్వచ్ఛమైన పుత్తడి తులం రూ.93,930
- రూ.86,100 పలుకుతున్న 22 క్యారెట్ పసిడి విలువ

గోల్డ్ మార్కెట్ రివర్స్ గేర్ తీసుకున్నది.

మొన్నటిదాకా ఫుల్ స్వింగ్‌లో ఉన్న బంగారం ధరలు ఇప్పుడు డౌన్ ట్రెండ్‌లోకి జారుకున్నాయి.

రెండు రోజుల్లో తులం విలువ రూ.2,450 పతనమైంది మరి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ రేటు 10 గ్రాములు రూ.93,930 పలుకుతున్నది.

న్యూఢిల్లీ, మే 15: దేశీయ మార్కెట్‌లో బంగారానికి గిరాకీ సన్నగిల్లిందా? అంటే.. అవునన్నట్టుగానే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతకొద్దిరోజులుగా పసిడి ధరలు తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతుండటమే ఇందుకు నిదర్శనం. ఈ క్రమంలోనే దేశ రాజధాని ఢిల్లీలో రెండు రోజుల్లోనే పుత్తడి రేటు దాదాపు రెండున్నర వేల రూపాయలు పడిపోయింది. గురువారం 24 క్యారెట్ తులం విలువ రూ.1,800 దిగజారి రూ.95,050కి పరిమితమైంది. బుధవారం కూడా రూ.650 క్షీణించగా, సోమవారమైతే ఏకంగా రూ.3,400 పతనం కావడం గమనార్హం.

హైదరాబాద్‌లో..

హైదరాబాద్‌లోనూ బంగారం ధరలు దిగొస్తున్నాయి. గురువారం 24 క్యారెట్ తులం రేటు రూ.2,130 తగ్గి రూ.93,930గా నమోదైంది. 22 క్యారెట్ 10 గ్రాముల విలువ రూ.1,950 పడిపోయి రూ.86,100గా ఉన్నది. అయితే ధరల్లో స్థిరత్వం లోపించడం.. కొనుగోలుదారులను వేచి చూసే ధోరణిలోకి నెడుతున్నదని జ్యుయెల్లర్స్ వాపోతున్నారు. మార్కెట్‌లో ఈ ఒడిదొడుకులు తగ్గితే వ్యాపారం తిరిగి పుంజుకోవచ్చన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత నెల ఏప్రిల్ 22న దేశీయంగా పసిడి ధర ఆల్‌టైమ్ హైని తాకుతూ తులం 24 క్యారెట్ రూ.1,01,600 పలికిన సంగతి విదితమే.

వెండి ధరలు కూడా..

బంగారంతోపాటు వెండి ధరలూ దిగొస్తున్నాయి. వరుసగా నాల్గోరోజూ రేట్లు పడిపోగా.. గురువారం మరో రూ.1,000 తగ్గి కిలో వెండి విలువ రూ.97,000కు పరిమితమైంది. బుధవారం రూ.1,450 పతనమవగా, మొత్తంగా ఈ నాలుగు రోజుల్లో రూ.2,900 క్షీణించినట్టైంది. కాగా, అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పడిపోతున్నాయని, ఆ ప్రభావం దేశీయ మార్కెట్‌పైనా సహజంగానే ఉంటున్నదని అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. ఇక అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ రేటు 16.81 డాలర్లు దిగి 3,160.71 డాలర్లకు చేరింది. మొత్తానికి ఆయా దేశాల మధ్య భౌగోళిక, రాజకీయ, వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు తగ్గడంతో ఇన్వెస్టర్లు.. తమ పెట్టుబడులను బంగారం నుంచి వెనక్కి తీసుకుంటున్నారని మార్కెట్ నిపుణులు తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు. ఇది ధరల క్షీణితకు దారితీస్తున్నట్టు అభివర్ణిస్తున్నారు.

పతనానికి ప్రధాన కారణాలు

- శాంతించిన భౌగోళిక ఉద్రిక్తతలు
- భారత్-పాక్ మధ్య తగ్గిన ఆందోళనలు
- అమెరికా-చైనా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్
- మళ్లీ స్టాక్ మార్కెట్లలోకి మదుపరుల పెట్టుబడులు
- అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల క్షీణత
- అంతంతమాత్రంగా డిమాండ్

టాటా లాక్‌హీడ్‌పై కఠిన చర్యలు వద్దు

ఈపీఎఫ్‌వోకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): బకాయిల వసూలులో భాగంగా విమాన విడిభాగాల తయారీ సంస్థ టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ ఎంఏఎల్)పై ఎంప్లాయిస్ ప్రావిడెంట్ కఠిన చర్యలు తీసుకోరాదని హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 21 వరకు నిషేధిత జాబితాలో ఉంచి ఖాతాలు స్తంభింపజేయరాదని ఉత్తర్వుల్లో పేర్కొంది. 2012 నుంచి 2017 మధ్యకాలంలో పనిచేసిన 14 మంది విదేశీ కార్మికులకు పీఎఫ్ జమ చేయకపోవడంతో ఈపీఎఫ్ఓ ఈ కంపెనీని నిషేధిత జాబితాలో చేర్చి బ్యాంకు ఖాతాను స్తంభింపజేయడానికి ఉత్తర్వులు జారీ చేసింది. ఈచర్యను టీఎల్ ఎంఏఎల్ సంస్థ సవాలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పుల్లా కార్తీక్ ఇటీవల విచారించారు. సంస్థ ఇప్పటికే రూ.4 కోట్లు డిపాజిట్ చేసిందని, మిగిలిన రూ.10 కోట్లలో రూ.4.30 కోట్లు రికవరీ కూడా చేసినట్టు కంపెనీ తరుపున వాదిస్తున్న న్యాయవాది తెలిపారు. కౌంటర్ దాఖలు చేయాలని ఈపీఎఫ్ ఓను ఆదేశించిన హైకోర్టు విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది.

సెమీకండక్టర్ల ప్లాంట్ హుళక్కే?

తాజాగా యూపీలో ఏర్పాటుచేస్తున్న ఫాక్స్‌కాన్

ఇప్పటికే రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్లిన రెండు కంపెనీలు

హైదరాబాద్, మే 15(నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన ఒక్కో సంస్థ ఇక్కడి అమడదూరంగా వెళ్లిపోతున్నాయి. దీంతో చిప్‌ల తయారీ పరిశ్రమ ఇక్కడికి రావడం ఎండమావిగానే కనిపిస్తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు కంపెనీలు రాష్ట్రంలో యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇక్కడ ఏర్పాటు చేయలేమని భావించి ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లిపోయాయి. ఇప్పటివరకు దేశంలో ఆరు సెమీకండక్టర్ యూనిట్లకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపగా..అందులో మన రాష్ట్రానికి చోటు లేకపోవడం విశేషం. నాలుగు యూనిట్లు గుజరాత్‌లో ఏర్పాటుకానుండగా, ఒకటి అస్సాం, మరొకటి ఉత్తరప్రదేశ్‌కు తరలిపోయింది. ఇక్కడ యూనిట్ ఏర్పాటునకు అవసరమైన పర్యావరణ పరిస్థితులు పుష్కలంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ సర్కార్ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రానికి గుడ్‌బై పలుకుతున్నాయి. ఇదే క్రమంలో హెచ్‌సీఎల్, ఫాక్స్‌కాన్ సంయుక్త భాగస్వామ్యంలో రూ.3,706 కోట్ల పెట్టుబడితో ఉత్తరప్రదేశ్‌లో చిప్‌ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయి. వచ్చే రెండేండ్లలో అందుబాటులోకి రానున్న ఈ యూనిట్‌లో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఆటోమొబైల్స్, పీసీల కోసం డిస్‌ప్లే డ్రైవ్ చిప్‌లు తయారుకానున్నాయి. తాజా చిప్ యూనిట్‌కు క్యాబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో మన రాష్ట్రంలో సెమీకండక్టర్ల పరిశ్రమ భవితవ్యంపై సర్వత్రా చర్చ మొదలైంది. దీనికి కారణం లేకపోలేదు. ఐటీ రంగానికి ప్రధాన కేంద్రంగా మారిన హైదరాబాద్‌ను సెమీకండక్టర్ల తయారీలోనూ అభివృద్ధి చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషిచేసింది. ఇప్పటికే ప్రపంచ ప్రఖ్యాత ఐటీ కంపెనీల ఏర్పాటు ద్వారా మన రాష్ట్రంలో సెమీకండక్టర్ల పరిశ్రమకు అవసరమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పాటైంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ విశేష కృషితో కార్నింగ్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్, కేన్స్ సెమికాన్ కంపెనీలు రాష్ట్రంలో సెమీకండక్టర్ల యూనిట్లు స్థాపించేందుకు ముందుకొచ్చాయి. ఈలోగా రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కార్నింగ్ తమిళనాడుకు, కేన్స్ సెమికాన్ గుజరాత్‌కు తరలివెళ్లిపోయింది.



సెమీకండక్టర్లకు గిరాకీ..

సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్న వేళ సెమీకండక్టర్ల పరిశ్రమకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న గిరాకీ అంతాఇంతా కాదు. కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక అవసరాలు, విమాన యాన రంగం తదితర వాటిల్లో చిప్‌ల వినియోగం రోజురోజుకూ గణనీయంగా పెరుగుతున్నది. ఇందులో భాగంగా దిగుమతులను తగ్గించి దేశంలోనే సెమీకండర్ల తయారీని ప్రోత్సహించేందుకు ఇండియా సెమీకండక్టర్ మిషన్(ఐఎస్ఎం)ను ఏర్పాటు చేసింది.

రాష్ట్రానికి రావడానికి జంకుతున్న కంపెనీలు

సెమీకండక్టర్ యూనిట్ల స్థాపనకు రాష్ట్రంలో పుష్కలమైన వనరులు ఉన్నప్పటికీ కంపెనీలు ముందుకు రాకపోవడంపట్ల పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అనేక ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సేవలను అందిస్తున్నప్పటికీ.. సెమీకండక్టర్ల యూనిట్ ఏర్పాటు చేయడానికి ముందుకురావడం లేదు. వీటిలో అమెరికాకు చెందిన ఇంటెల్, క్వాల్కమ్, మైక్రోచిప్ టెక్నాలజీ ఇంక్.. అలాగే, జర్మనీకి చెందిన ఇన్ఫినియస్ టెక్నాలజీ, టెస్సోల్, మైక్రాస్ టెక్నాలజీ, మోస్‌చిప్, మిరాఫ్రా టెక్నాలజీ, ఏఎండీలు ఉన్నాయి.

అమ్మకానికి భూములు

రూ.1,000 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యం

న్యూఢిల్లీ/ముంబై, మే 15: పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ టెలికం సంస్థలు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్), మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ (ఎంటీఎన్ఎల్) స్థిరీకరణకు.. వాటి భూములను అమ్మే దిశగా కేంద్ర ప్రభుత్వం వెళ్తున్నది. ఇందులో భాగంగానే ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) దాదాపు రూ.1,000 కోట్ల విలువైన భూములను విక్రయించాలని చూస్తున్నట్టు సంబంధిత అధికారి ఒకరు చెప్తున్నారు. తద్వారా ఆయా సంస్థల రుణ భారాన్ని తగ్గించవచ్చని, వాటి ద్రవ్యలభ్యతను కూడా పెంచవచ్చని అంటున్నారు. ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ప్రభుత్వ రంగ సంస్థల శాఖ (డీపీఈ) భూములను గుర్తించగా.. వీటిని వీలైతే అమ్మడమో లేదా లీజుకు ఇవ్వడమో చేసే ఆలోచనలో మోదీ సర్కారు ఉన్నది. కాగా, బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌కు దేశంలోని ప్రధాన నగరాల్లో భూములుండగా.. 2-3 చోట్ల భూములను అమ్మకానికి తీసుకురాబోతున్నారు. ఈ ఏడాదిలోనే వీటిని అమ్మవచ్చని, రూ.1,000 కోట్లు రావచ్చని అంచనా.

సర్కారీ వైఫల్యం

ప్రభుత్వ సంస్థలే అయినప్పటికీ మార్కెట్‌లో ప్రైవేట్ రంగ కంపెనీలతో పోటీపడలేక బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ చతికిలపడ్డాయి. అయితే ఇందుకు కారణం కేంద్ర ప్రభుత్వ పెద్దలేనన్న విమర్శలు ఆయా సంస్థల ఉద్యోగ సంఘాలు, ఆర్థిక విశ్లేషకుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ప్రధానంగా స్పెక్ట్రం కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వకపోవడం చాలాచాలా నష్టపర్చిందన్న వాదనలున్నాయి. దీంతో ఏండ్ల తరబడి నెట్‌వర్క్‌ను విస్తరించలేక, సిగ్నలింగ్ లోపాలతో సబ్‌స్క్రైబర్లు దూరమైపోతున్నారు. మరోవైపు ఆదాయం లేక, నిర్వహణ భారమై అప్పుల ఊబిలో కూరుకుపోయాయని చెప్తున్నారు. రుణ చెల్లింపుల్లో ఎంటీఎన్ఎల్ విఫలమవుతుండటంతో రుణదాతల (బ్యాంకర్లు)తో క్యాబినెట్ సెక్రటరీ టీవీ సోమనాథన్ శుక్రవారం సమావేశమవుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది.

- గత ఏడాది నవంబర్ నాటికి బీఎస్ఎన్ఎల్ రుణ భారం రూ.23,297 కోట్లు.
- ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.33,000 కోట్లు దాటిన ఎంటీఎన్ఎల్ మొత్తం అప్పులు.
- బ్యాంకులకు రూ.8,346 కోట్లను చెల్లించడంలో విఫలమైన ఎంటీఎన్ఎల్.

రాకేష్ రెడ్డికి సన్మానం

రాకేష్‌రెడ్డిని సన్మానించిన దిండిగాల, నాయకులు

ఇల్లెందు, మే 15ః బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి గురువారం ఇల్లెందు వచ్చారు. బీఆర్ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు, ఉద్యమ నాయకుడు దిండిగాల రాజేందర్‌ను ఆయన ఇంటి వద్ద కలుసుకున్నారు. రాకేష్‌రెడ్డిని దిండిగాల, నాయకులు స్వాగతించి సన్మానించారు. పరుచూరి వెంకటేశ్వరరావు, అజ్మీర బావ్‌సింగ్ నాయక్, తోట లలితా శారద, మహ్మద్ జబ్బార్, గిన్నారపు రాజేష్, సత్తాల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి, మే 15: మండలంలోని దాస్‌తండాలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ ఇంటికి రాకేష్‌రెడ్డి గురువారం వచ్చారు. హరిప్రియానాయక్ మరిది కూతురు వివాహం ఇటీవలే జరిగింది. నూతన వధూవరులను రాకేష్‌రెడ్డి ఆశీర్వదించారు.

భూమి పండుగలో ఐటీడీఏ పీవో

భూమి పండుగలో పాల్గొన్న పీవో రాహుల్

ములకలపల్లి, మే 15: మండలంలోని తిమ్మంపేట పంచాయతీ రాజీవ్‌నగర్ కాలనీలో జరుగుతున్న భూమి పండుగలో గురువారం ముఖ్య అతిథిగా భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ పాల్గొన్నారు. 1992 తర్వాత తమ గ్రామానికి ఐటీడీఏ పీవో వచ్చారని అంటూ గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు.

దారి దోపిడీ నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సతీష్

పాల్వంచ, మే 15: దారి దోపిడీ కేసులో నిందితులు ముగ్గురిని పాల్వంచ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసు వివరాలను గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో డీఎస్పీ సతీష్ ఇలా వివరించారు- పాల్వంచకు చెందిన తిరుమలరాజు, ఆయన బావ మంగయ్య కలిసి ఈ నెల 12వ తేదీ రాత్రి సుమారు పది గంటల సమయంలో స్థానిక కరకవాగు నుంచి సోనియా నగర్‌కు బైక్‌పై వెళ్తున్నారు. శేఖరంబంజర ఊరి చివరన, రైల్వే ట్రాక్ పక్కన ఉన్న రోడ్డుపై గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఆటోను అడ్డంగా నిలిపి బైక్‌పై వెళ్తున్న ఆ ఇద్దరిని ఆపారు. వారిద్దరినీ కొట్టారు. వారి నుంచి సెల్ ఫోన్, రూ.5,000 నగదు లాక్కుని వెళ్లిపోయారు. మరుసటి రోజున పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో తిరుమలరాజు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. దోపిడీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. దోపిడీ నిందితులు ముగ్గురిని గురువారం మధ్యాహ్నం పాల్వంచం నవభారత్ ఏరియా వద్ద పట్టుకుని విచారించారు. తామే నేరం చేసినట్లు వారు అంగీకరించారు. ఈ ముగ్గురినీ.. పాల్వంచ శేఖరం బంజరకు చెందిన బానోత్ కిషోర్, బానోత్ కుమార్, భూక్యా పవన్‌గా పోలీసులు గుర్తించారు. వీరి నుంచి ఆటో, ఫిర్యాది నుంచి లాక్కున్న సెల్ ఫోన్‌తోపాటు నగదులో ఖర్చు పెట్టగా మిగిలిన రూ.1500ను స్వాధీనపర్చుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచారు.

'ప్రగతిమైదానం' అస్తవ్యస్తం

- గత కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన స్టేడియంపై ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు శీతకన్ను
- ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దానిని పాడి ఆవుగా మార్చుకున్న అధికారులు
- వాకింగ్ ట్రాక్ పేరుతో రూ.లక్షల నిధులు నీళ్లపాలు.. మైదానంలో తేలిన కంకర, ఇసుక

భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో 2015లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ప్రగతి మైదానం ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో అస్తవ్యస్తమైంది. ఈ మైదానంపై ప్రస్తుత రేవంత్ సర్కారు శీతకన్ను వేయడం, కనీసం పట్టించుకోకపోవడం వంటి కారణాలతో అధికారులు కూడా దీనిని పాడి ఆవుగా మార్చుకున్నారు. వాకింగ్ ట్రాక్ పేరుతో రూ.లక్షల నిధులు నీళ్లపాలు చేశారు. ఫలితంగా మైదానంలో కంకర, ఇసుక పైకి తేలాయి. ఇటీవల వేసవి శిక్షణ శిబిరాల కోసం ఇక్కడికి వచ్చిన విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు.

-కొత్తగూడెం అర్బన్, మే 15

ప్రగతి మైదానంలో తేలిన కంకర, ఇసుక

కొత్తగూడెంలో క్రీడాపోటీలు, ఇతరత్రా ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ కోసం కొత్తగూడెంలో ప్రకాశం స్టేడియం మాత్రమే ఉండేది. ఏదైనా ఈవెంట్ నిర్వహించుకోవాలంటే వేలాది రూపాయలు సింగరేణికి చెల్లిస్తేనే ఆ స్టేడియంలో కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు అనుమతులు లభించేవి. దీంతో ప్రకాశం స్టేడియం నిత్యం బిజీగానే ఉండేది. ఈవెంట్లు, క్రీడా పోటీలు నిర్వహించుకోవాలంటే ఒక్కోసారి రోజుల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. అలాగే, ఈవెంట్లు జరిగినప్పుడు ప్రాక్టీస్ చేసుకునేందుకు క్రీడాకారులు అనేక ఇబ్బందులుపడేవారు. ఇక రామవరం ప్రాంతంలో సాధన స్టేడియం ఉన్నప్పటికీ.. అది ఆ ప్రాంత క్రీడాకారులకే అందుబాటులో ఉండేది. వీటిని దృష్టిలో ఉంచుకొని 2015లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడా మైదానం నిర్మాణానికి ముందడుగు వేసింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా, క్రీడాపోటీలు నిర్వహించుకునేందుకు, క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా రాజీవ్‌పార్క్ సమీపాన ఉన్న ఏడెకరాల స్థలాన్ని చదును చేసి 'ప్రగతి మైదాన్' పేరుతో స్టేడియాన్ని నిర్మించింది. రూ.లక్షలాది నిధులతో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసింది. కానీ ఇప్పటి ప్రభుత్వ పట్టింపులేని తనం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం దాని రూపును కోల్పోయింది.

నాడు రూ.లక్షల నిధుల కేటాయింపు

'పట్టణ ప్రగతి' నిధుల ద్వారా ప్రగతి మైదాన్‌కు రూ.లక్షల నిధులను నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించింది. ప్రహరీ నిర్మాణానికి రూ.50 లక్షలు, టెన్నిస్ కోర్టుకు రూ.50 లక్షలు, బాస్కెట్‌బాల్ కోర్టుకు రూ.15 లక్షలు, వాకింగ్ ట్రాక్‌కు రూ.20 లక్షలు, మొక్కలు, బెంచీల ఏర్పాటుకు రూ.5 లక్షలు, టాయిలెట్ల నిర్మాణానికి రూ.8 లక్షలు, రాజీవ్‌పార్కులోని ఫట్సాల్ కోర్టుకు రూ.50 లక్షల చొప్పున సుమారు రూ.1.98 కోట్లను కేటాయించి పనులు చేపట్టింది. కానీ తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రగతి మైదాన్ కళ రాకపోగా.. క్రీడాకారులకు నిత్యం ఇబ్బందులు పెరిగాయి. మైదానం మధ్యలో సింథటిక్ కోర్టు నిర్మిస్తామని చెప్పిన అధికారుల.. రూ.20 లక్షలతో పనులు చేపట్టారు. కానీ సిమెంట్ పనులు చేపట్టి దానికి మధ్యలోనే మంగళం పాడేశారు. ఇక కాంట్రాక్టర్ కూడా సగంలోనే పనులను నిలిపివేయడంతో కంకర, ఇసుక, ఇనుప రాడ్లు పైకి తేలి వాకింగ్, రన్నింగ్, ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు తీవ్ర ఆటంకాన్ని కలిగిస్తున్నాయి. అయితే, నిర్మాణ పనులు నిలిచిపోవడంతో క్రీడాకారుల ఇబ్బందులను గమనించిన కలెక్టర్.. మైదానం చుట్టూ ఎర్ర మట్టి పోసి లెవెల్ చేయాలని అధికారులను ఆదేశించారు. సింగరేణి అధికారులతో చర్చించి అవసరమైన 150 లారీల మట్టిని పోసి లెవెల్ చేయాలని భావించారు. కానీ మున్సిపల్ అధికారులు మాత్రం సుమారు 70 లారీల ఎర్రమట్టిని మాత్రమే పోసి మ.. మ.. అనిపించారు. దీంతో పూర్తిస్థాయిలో పని జరగకపోవడంతో మైదానమంతా ఎత్తుపల్లాలుగా మారింది. మళ్లీ రాళ్లు, కంకర తేలాయి. క్రీడాకారులకు ఇబ్బందులను తెచ్చిపెట్టాయి.

మళ్లీ వాకింగ్ ట్రాక్ పనులు షూరూ..

మైదానం మధ్యలో సింథటిక్ ట్రాక్ అంటూ అధికారులు రూ.20 లక్షలు కేటాయింపులు చేసుకొని మధ్యలో ముగించారు. మళ్లీ ఇప్పుడు తాజాగా మైదానం చుట్టూ సింథటిక్ ట్రాక్ స్థానంలో వాకింగ్ ట్రాక్ అంటూ పనులు చేపట్టారు. దీంతో మైదానం ఆధునీకరణ అభివృద్ధి అంటూ, క్రీడాకారుల కోసం అంటూ నిత్యం ఏదో ఒక పనిని చేస్తున్నారు. అయితే, ప్రభుత్వ నిధులను ఏదో ఒక రకంగా జేబులో నింపుకునేందుకే మున్సిపల్ అధికారులు శ్రద్ధ వహిస్తున్నారనింటూ క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. చేసిన పనులనే మళ్లీ మళ్లీ వేయడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నిస్తున్నారు.

టాయిలెట్ల సంగతి సరేసరి..

మైదానంలో ప్రాక్టీస్‌కు వచ్చే వారికి వసతుల పేరుతో ఏర్పాటు చేసి టాయిలెట్ల సంగతి సరేసరి అన్నట్లుగా ఉంది. మున్సిపల్ సిబ్బంది నిర్వహణ, పర్యవేక్షణ లేకపోవడంతో అవి ఎందుకు పనికిరాకుండా పోయాయి. సుమారు రూ.5 లక్షలతో నిర్మించిన ఈ టాయిలెట్లు ఇప్పుడు అధ్వానంగా ఉన్నాయి. సింక్ పగిలిపోయింది. డోర్లు విరిగిపోయాయి. నీటి సదుపాయం లేదు. దీంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఇటీవల ఇక్కడ నిర్వహించే స్పోర్ట్స్ ఈవెంట్‌కు వచ్చిన విద్యార్థులు, క్రీడాకారులు టాయిలెట్లు సరిగా లేక ఇబ్బందులుపడ్డారు.

టాయిలెట్లు బాగలేవు..

ప్రగతి మైదానంలో టాయిలెట్లు అస్సలు బాగాలేవు. బాత్ రూంలు కట్టి అలా వదిలేశారు. డోర్లు విరిగిపోయాయి. నీళ్లు కూడా లేవు. టాయిలెట్లు లేకపోతే ప్రాక్టీస్ చేసే వాళ్లకు ఇబ్బందే కదా. అధికారులు గ్రౌండ్‌ను మంచిగా చేయాలి. టాయిలెట్లను బాగు చేయాలి.

-హైమద్, కొత్తగూడెం

యూరియా అతి వినియోగంతో ముప్పు

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

అశ్వారావుపేట రూరల్, మే 15: యూరియాను అతిగా వినియోగిస్తే నేలకు, మానవాళికి ముప్పు ఉంటుందని రైతులను వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు హెచ్చరించారు. మండలంలోని బచ్చువారిగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పొలంలోని ప్రతి కీటకమూ హాని కలిగించదని, మేలు చేసే మిత్ర పురుగులు కూడా ఉంటాయని అన్నారు. రసాయనాలు పిచికారీ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. తెలిసో తెలియకో యూరియాను మోతాదుకు మించి వాడితే నేల తల్లికి సుస్తీ చేసినట్లవుతుందని, ఆ పంట ఉత్పత్తులను తిన్న మనుషులకు క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తాయని హెచ్చరించారు. వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు కృష్ణతేజ, డాక్టర్ పావని, మధుసూదన్ రెడ్డి, వ్యవసాయ అధికారి శివరాంప్రసాద్, ఉద్యానవన అధికారి వేణుమాధవ్, ఏఈవోలు షాకీరాభాను, రవీంద్ర, సతీష్, పంచాయతీ కార్యదర్శి మోహరాజ్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీటు కోసం సిగపట్లు

- ఇద్దరి మహిళల గొడవతో ఇబ్బందిపడిన తోటి ప్రయాణికులు
- బస్సును పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకెళ్లి ఫిర్యాదు చేసిన డ్రైవర్
- వారిద్దరినీ బస్సు దింపి కౌన్సిలింగ్ నిర్వహించిన పోలీసులు

అశ్వాపురంలో ఆర్టీసీ బస్సులో సీట్ల కోసం కొట్టుకుంటున్న మహిళలు

అశ్వాపురం/మణుగ